క్లుప్తంగా

వాడ్రాపల్లిలో స్టూడెంట్ కిట్ల పంపిణీ



కిట్లను అందజేస్తున్న నాయకులు

మునగపాక:మండలంలోని వాడ్రాపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.విద్యాభివృద్ధికి ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటోందని చెప్పారు.

ఘనంగా అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం



అభయాంజనేయ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

మునగపాక: స్థానిక సంతబయిలులో అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఉదయం నుంచి స్వామిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో హోమం , తమలపాకులతో సహస్ర నామార్చన నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేశారు.

పాఠశాలకు సామగ్రి వితరణ



పాఠశాలకు సామగ్రిని అందజేస్తున్న సైన్స్ టీచర్ సుబ్బలక్ష్మి

ఎస్.రాయవరం: గుడివాడ ఉన్నత పాఠశాలలో ఈనెల 30న పదవీ విమరణచేయనున్న సైన్స్ టీచర్ కె.సుబ్బలక్ష్మి పాఠశాలలకు సామగ్రి అందజేశారు. విద్యార్థులకు 120 జామెట్రీ బాక్సులు, రెండు మంచినీటి క్యాన్లు,మూడు బల్లలు అందజేశారు. పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు సత్కారాలు తీసుకుని వెళతారు తప్ప సుబ్బలక్ష్మిలా తిరిగి పాఠశాలలకు సహకారం అందించే వారు అరుదుగా ఉంటారని ప్రధానోపాధ్యాయులు నాగన్నదొర ఈ సందర్భంగా తెలిపారు.

ఆదమరిస్తే అంతే సంగతి..



రక్షణ గోడ లేని మినీ వంతెన

కోటవురట్ల: పందూరులో గెడ్డపై గల మినీ వంతెకు రక్షణ గోడ లేకపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. వాహనదారులు, పిల్లలు ఏమాత్రం అజాగ్రత్తగా వెళ్లిన కిందపడక తప్పదు. ఎన్నో ఏళ్లుగా ఈ సమస్య ఉన్నా అధికారులు పట్టించుకోలేదు. రాత్రి వేళల్లో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్టు స్థానికులు చెబుతున్నారు. నిత్యం జనసంచారం ఉండే ప్రదేశం కావడంతో మినీ వంతెనకు రెండు వైపుల రక్షణ గోడ నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎల్అండ్‌టీ ఒప్పంద కార్మికుడి మృతి



ఓన్‌దానన్ సాహు మృత దేహం

రాంబిల్లి: నేవల్‌బేస్‌లో ఎల్ అండ్‌టీ సంస్థలో ఒప్పంద కార్మికుడుగా పనిచేస్తున్న ఓన్‌దానన్ సాహు(44) మృతి చెందినట్టు సీఐ ధీనబంధు తెలిపారు. విధి నిర్వహణలో ఉండగా మెట్ల మార్గం పై నుంచి సాహు జారిపడినట్టు చెప్పారు. వెంటనే అనకాపల్లి ఉషా ప్రైమ్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సాహు మృతి చెందాడన్నారు. శుక్రవారం సాహు భార్య , కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. మృతిని కుటుంబానికి కంపెనీ యాజమాన్యం రూ 20 లక్షలు ఆర్థిక సాయం అందజేస్తామని హామీ ఇచ్చిందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఈవోఆర్‌డీ చంద్రశేఖర్



సమావేశానికి హాజరైన అధికారులు

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు



అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న వైద్యాధికారి రాజేశ్వరి



దిమిలిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, విద్యార్థులు

పాయకరావుపేట: మండలంలో అంటువ్యాధులు ప్రబలకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఈవోఆర్‌డీ సీహెచ్ చంద్రశేఖర్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో పారిశుధ్యలోపం లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. డ్రైనేజీల్లో ఎప్పటికప్పుడు పూడిక తీయాలని, మురుగు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. తాగు నీటి ట్యాంకులను శుభ్రం చేయాలని, డయేరియా రాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో వైద్య, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది, పంచాయితీ కార్యదర్శులు, విద్యాశాఖ అధికారులు, ఐసీడీఎస్ అధికారులు, ఐకేపీ అధికారులు పాల్గొన్నారు.

డెంగ్యూపై అప్రమత్తం

రాంబిల్లి: డెంగ్యూ వ్యాధిపై అందరూ అప్రమత్తంగా ఉండాలని దిమిలి పీహెచ్‌సీ వైద్యురాలు బాల గంగా శ్రావణి సూచించారు. దిమిలిలో శుక్రవారం డెంగ్యూ వ్యాధిపై ఆమె అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. దోమల నియంత్రణకు అందరూ చర్యలు తీసుకోవాలని వైద్యురాలు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో రాజు , సూపర్‌వైజర్ ధనరాజు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం:అతిసార వ్యాధి ప్రభలకుండా తగిన చర్యలు తీసుకోవాలని పెనుగొల్లు పీహెచ్‌సీ వైద్యాధికారి రాజేశ్వరి అన్నారు. డయేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం గోకులపాడు అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ కలుషిత ఆహారం, కలుషత నీరు వల్ల ఈ వ్యాధి బారిన పడతారని చెప్పారు. నిత్యం శుభ్రమైన ఆహారం తీసుకుని ఆరోగ్యకరంగా ఉండాలన్నారు.

రైతులు ఆర్థికంగా ఎదగాలి



ఉత్తమ రైతును సన్మానిస్తున్న ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్



హాజరైన రైతులు

రాంబిల్లి: రైతులు ఆర్థికంగా ఎదిగి నిలదొక్కునాడే దేశం, రాష్ట్రం అభివృద్ధి చెందినట్టవుతుందని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ అన్నారు. హరిపురం బీసీటీ కేవీకే వద్ద శుక్రవారం కేవీకే స్వర్ణోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ కేవీకేల ద్వారా రైతులకు శాస్త్రవేత్తలు సలహాలు, సూచనలు సకాలంలో అందించి రైతుల అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. అనంతరం ఉత్తమ రైతులను ఆయన ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ధూళి నాగరాజు, కేవీకే శాస్త్రవేత్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు , రైతులు, అధికారులు పాల్గొన్నారు.

వరి విత్తనాల పంపిణీ



విత్తనాలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ వాసు

అచ్యుతాపురం: మండలంలోని ఉప్పవరం రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం వరి విత్తనాల పంపిణీ చేశారు. మల్లవరం సర్పంచ్ పిన్నమరాజు వాసు వీటిని పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో గంగిరెడ్డి రాము తదితరులు పాల్గొన్నారు.

రేపూ విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

అచ్యుతాపురం: ఏపీఈపీడీసీఎల్ కౌంటర్ సెంటర్లలో ఈ నెల 30వ తేదీ ఆదివారం విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని ఆపరేషన్స్ సర్కిల్ పర్యవేక్షక ఇంజినీర్ మహేంద్రనాథ్ తెలిపారు. ఈసేవ, మీ సేవ కేంద్రాలు, మొబైల్ యాప్‌ల ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని పేర్కొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

రాంబిల్లి: మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో వెంకటాచలం తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు ఎంపీపీ శిరీష అధ్యక్షతన సమావేశం జరుగుతుందని, ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ హాజరవుతారని పేర్కొన్నారు. అధికారులు నివేదికలతో హాజరుకావాలని ఎంపీడీవో సూచించారు.

పిల్లల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తప్పనిసరి



విద్యార్థుల బరువును పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

మునగపాక:విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యంగా ఉండాలంటే పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని మునగపాక పీహెచ్‌సీ ఏఎన్ఎం రేవతి పేర్కొన్నారు. మునగపాక ప్రాథమిక పాఠశాల పరిధిలోని పిల్లలకు బరువు, ఎత్తు, రక్తశాతం వంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలు ఆరోగ్యం, ఆహారం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పిల్లలు ఆరోగ్యంగా ఉన్ననాడే చదువుపై దృష్టి సారించగలరని చెప్పారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో ముమ్మరంగా పారిశుధ్య పనులు



కేశవరంలో ఫ్రై డే డ్రై డే నిర్వహిస్తున్న సిబ్బంది

పాయకరావుపేట: మండలంలోని పలు గ్రామాల్లో సచివాలయ సిబ్బంది పారిశుధ్య పనులు చేయిస్తున్నట్టు ఈవోఆర్‌డీ సీహెచ్ చంద్రశేఖర్ తెలిపారు. గ్రామాల్లో ఇళ్ల వద్ద కుండీల్లోను, డ్రమ్ముల్లోను మురికి నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ట్యాంక్‌లను బ్లీచింగ్ వేసి శుభ్రం చేస్తున్నట్టు తెలిపారు. ఫ్రై డే, డ్రై డే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కేశవరంలో పారిశుధ్యపనులు నిర్వహించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలి



ఆర్డీవో చిన్నికృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల ఐక్య వేదిక సభ్యులు

అనకాపల్లి: ఆకాశాన్ని అంటుతున్న నిత్యావసర సరకుల ధరలతో బడుగు, బలహీన వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పట్టణ ప్రజా సంఘాల ఐక్య వేదిక అధ్యక్షుడు బొట్టా చిన్నయాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసరాల ధరలు తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో ఏజే చిన్నికృష్ణకు ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం వినతి పత్రం అందించారు. గడచిన 20 రోజులుగా కూరగాయల ధరలు సామాన్య ప్రజలకు అందనంత ఎక్కువగా పెరిగాయని, బియ్యం కిలోకి రూ.5 పెంచారని, పప్పుదినుసుల ధరలు కూడా భారీగా పెరిగినట్లు వాపోయారు. ధరల నియంత్రణకు జిల్లా అధికార యంత్రాంగం సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో వేదిక నాయకులు ఆళ్ల ప్రవీణ్‌కుమార్, సూదికొండ మాణిక్యాలరావు, బొబ్బిలి గోవిందరాజులు, ముగడ అప్పారావు, బర్నికాన సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా ఖరీఫ్ వరి విత్తనాల పంపిణీ

- ఇప్పటికే 60 శాతం పంపిణీ పూర్తి
- మండలానికి అదనంగా 50 క్వింటాళ్ల ఆర్జీఎల్ విత్తనాలు



ఏనుగుతునిలో వరి విత్తనాల అందజేత

కశింకోట: మండలంలోని రైతు భరోసా కేంద్రా (ఆర్బీకే)ల ద్వారా రైతులకు ఖరీఫ్ వరి విత్తనాల పంపిణీ కార్యక్రమం ముమ్మరంగా జరుగుతోంది. ఇప్పటికే 60 శాతం మేర విత్తనాల పంపిణీ పూర్తయింది. మిగిలిన విత్తనాల పంపిణీకి ఏర్పాట్లు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సచివాలయాల వారీగా 19 ఆర్బీకేలను ఏర్పాటు చేశారు. వాటి ద్వారానే రైతులకు వరి విత్తనాలను వ్యవసాయ శాఖ అధికారులు అందిస్తున్నారు.

మండలానికి ఈ ఏడాది తొలి విడతగా 620 క్వింటాళ్ల వరి విత్తనాలు సరఫరా చేశారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా సాగు చేసే ఆర్జీఎల్ రకంతో పాటు సోనా మసూరి, సాంబ మసూరి, ఇతర రకాల విత్తనాలను కూడా అందుబాటులో ఉంచారు. ముందుగా రిజిస్ట్రేషన్ చేసిన మేరకు రైతులకు రాయితీపై విత్తనాలు పంపిణీ చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో వరి సాగుకు అనుకూల వాతావరణం ఏర్పడింది. దీంతో విత్తనాలను రైతులు తీసుకెళ్లి వారి ఇళ్ల వద్ద భద్రపరచుకుంటున్నారు. కొందరు ఇప్పటికే నారుమళ్లు వేసే పనిలో ఉన్నారు. మిగిలిన వారు కూడా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మండలానికి సరఫరా చేసిన విత్తనాలు సరిపోవని, అదనంగా విత్తనాలు రప్పించి, కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఈ విషయమై మండల వ్యవసాయ అధికారి ఎం.స్వప్నను సంప్రదించగా, మండలానికి వరి విత్తనాల అవసరంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. మరో 50 క్వింటాళ్ల ఆర్జీఎల్ రకం విత్తనాల సరఫరాకు తాజాగా ఆమోదం లభించిందన్నారు. అవి శనివారానికి ఇక్కడకు చేరగలవన్నారు. దీంతో విత్తనాల కొరత ఉండదని పేర్కొన్నారు. చిన్న గ్రామాల్లో విత్తనాల పంపిణీ దాదాపు పూర్తి అయిందని, మిగిలిన గ్రామాల్లో పంపిణీ జరుగుతోందన్నారు.



వెదురుపర్తి ఆర్బీకేలో వరి విత్తనాల పంపిణీ

'నేను బడికి పోతా'లో 83 మందికి ప్రవేశాలు



నేను బడికి పోతా ర్యాలీలో పాల్గొన్న ఎంఈవో-2 కోటేశ్వరరావు

అనకాపల్లి: ఈ నెల 13 నుంచి నిర్వహిస్తున్న 'నేను బడికి పోతా'కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు పట్టణం, మండల పరిధిలో బడిబయట ఉన్న 83 మంది బడి ఈడు పిల్లల్ని గుర్తించి, ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించినట్లు ఎంఈవో-2 ఎస్.కోటేశ్వరరావు తెలిపారు. జీవీఎంసీ భీమునిగుమ్మం హైస్కూల్ వద్ద శుక్రవారం జరిగిన నేను బడికి పోతా కార్యక్రమ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడి ఈడు పిల్లల్ని గుర్తించి దగ్గర్లోని ప్రభుత్వ స్కూళ్లలో చేర్పించి, వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేందుకు తల్లిదండ్రులు కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు గిరిధర్, వై.రాణి పాల్గొన్నారు.

ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు పీవీ



పీవీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గాయత్రీ సేవా ట్రస్టు ప్రతినిధులు

యలమంచిలి రూరల్: మాజీ ప్రధాని, బహుభాషాకోవిదుడు దివంగత పీవీ నరసింహారావు దేశానికి చేసిన సేవలు మరువలేనివని మున్సిపల్ వైస్ చైర్మన్ అర్రెపుసత్య గుప్తా అన్నారు. పీవీ నరసింహారావు 104వ జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక గాయత్రీ సేవాట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలు రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.మున్సిపల్ కార్యాలయానికి సమీపంలో ప్రధాన రహదారి పక్కనున్న పీవీ నరసింహారావు విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ అంతరాలు,అసమానతలు లేని సమాజం ఏర్పాటు కోసం సంస్కరణలకు శ్రీకారం చుట్టిన గొప్ప మార్గదర్శకుడు నరసింహారావు అని కొనియాడారు.దివాలా దశలో ఉన్న దేశ ఆర్థిక వ్యవస్థను సంస్కరణల వైద్యంతో కోలుకునేలా చేసి, మిగిలిన ప్రపంచంతో పోటీ పడేలా తీర్చిదిద్దిన ఘనత పీవీ నరసింహారావుదే అన్నారు. భారత ప్రధానుల్లో ఏకైక తెలుగు బిడ్డగా పీవీ నరసింహారావు ఎనలేని ఖ్యాతినార్జించారని పలువురు గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో బొద్దపు శ్రీను,గొర్లె నానాజీ,కొటారు నరేష్,గాయత్రీ సేవా ట్రస్టు ప్రతినిధులు పెద్దింటి సూర్యనారాయణ మూర్తి,రాచకొండ పట్టాభిరామయ్య,లవుడు లోవరాజు, గుర్రాల శేఖర్,సుందరపు బాబ్జీ,పల్లా సత్యనారాయణ,రాచకొండ శ్రీనివాస శర్మ,ఎస్ వెంకటేష్, భాగవతుల సాయి,రాయవరపు రాజు,ఆకొండి బాబి పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీల బకాయిలు చెల్లించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

యలమంచిలి: ఉపాధిహామీ పథకం కూలీల బకాయిలను వెంటనే చెల్లించాలని రైతు సంఘం నాయకులు కర్రి అప్పారావు కోరారు. సీఐటీయూ నాయకులతో కలసి శుక్రవారం ఆయన యలమంచిలి మండలం రేగుపాలెం,పోతిరెడ్డిపాలెం గ్రామాల్లో పనిచేస్తున్న ఉపాధిహామీ కూలీలు పడుతున్న ఇబ్బందులు, సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రేగుపాలెం, పోతిరెడ్డిపాలెం, రామభద్రపురంజంక్షన్ కాలనీకి చెందిన ఉపాధిహామీ పథకం కూలీలకు ఐదు వారాల నుంచి వేతన బకాయిలను ప్రభుత్వం చెల్లించడంలేదని, 100 రోజుల పనిదినాలు కల్పించబడం లేదని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బకాయిలను వెంటనే మంజూరు చేసి, 200 రోజుల పనిదినాలు కల్పించాలని, కూలిని రూ.600కు పెంచాలని డిమాండ్ చేశారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలకు డిమాండ్



ఎంఈవో మీనాక్షికి వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

యలమంచిలి: పాఠ్యపుస్తకాలు,యూనిఫాం పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్,కార్పొరేట్ పాఠశాలలపై విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బాబ్జి డిమాండ్ చేశారు. స్థానిక మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఎంఈవో మీనాక్షికి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యలమంచిలి పట్టణం,మండలంలో ఉన్న ప్రైవేట్,కార్పొరేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక శాతం ఫీజులను వసూలు చేయడమే కాకుండా పాఠ్యపుస్తకాలు,యూనిఫాంలు విక్రయిస్తూ అదనంగా నగదు వసూలు చేస్తున్నారని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు దుర్గారావు,శ్రీను,శివరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో ధార్మిక సమితి



మాట్లాడుతున్న ధర్మ ప్రచారకులు

ఎస్.రాయవరం:ప్రతి గ్రామంలోనూ ధార్మిక సమితును ఏర్పాటు చేసి, హిందూ సంప్రదాయాలను ఆచరించేలా చూడాలని సమరసత సేవా ఫౌండేషన్ విభాగ సంయోజక్ గురిమెళ్ల రాధాకృష్ణ అన్నారు. స్థానిక నూకాంబిక ఆలయంలో సమరసత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో ధార్మిక సమితులు నెలకొల్పాలని జిల్లా , మండల కన్వీనర్లకు సూచించారు.హిందూ దేవాలయాల ఆవశ్యకతపై ప్రత్యేక అవగాహన పెంచుకుని, హిందువులకు హితబోధ చేయాలన్నారు.పేద, నిమ్న వర్గాల్లో మత మార్పిడులను తగ్గించే క్రమంలో హిందూసంప్రదాయాన్ని వివరించాలన్నారు.ఈ కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు పోతు రంగారావు,ఆడారి గంగాధర్, శిరియాల సత్యనారాయణ, మండల కన్వీనర్ ముత్తా గోవిందరావు, మహిళా కన్వీనర్ పెదపాటి లక్ష్మి, పలు మండలాల సహసంయోజన సభ్యులు అర్చకులు ,ధర్మప్రచారకులు తదితరులు పాల్గొన్నారు.

పెట్రోలులో కల్తీ పై నిలదీత



పెట్రోల్ కల్తీ జరిగిందని చూపిస్తున్న బాధితుడు గోవిందు

పాయకరావుపేట: స్థానిక ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌లో పెట్రోలు కల్తీ జరిగిందని ఆరోపిస్తూ పట్టణానికి చెందిన జి.గోవిందు అనే వ్యక్తి బంక్ నిర్వాహకులను నిలదీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన మోటారు బైక్‌లో రూ. 500 పెట్రోలు వేయించుకుని ఇంటికి వెళ్లానన్నారు. అనంతరం బండి స్టార్ట్ కాకపోవడంతో వాహనం ట్యాంక్‌లో పెట్రోల్‌ను బాటిల్‌లోకి తీసి పరిశీలించగా నీరు ఉందన్నారు. మండల రెవెన్యూ అధికారులకు పిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ విషయమై తహసీల్దార్ బి.సూర్యానారాయణను సంప్రదించగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ద్వారా పెట్రోల్ శాంపిల్స్‌ను తీసుకున్నామని, అధికారులు పంపుతామని చెప్పారు.

కుక్కలు 'భౌ'బోయ్!



కశింకోట వీధుల్లో సంచరిస్తున్న కుక్కలు

కశింకోట: స్థానిక పంచాయతీ పరిధిలో ఊర కుక్కల బెడద అధికంగా ఉంది. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వీధుల్లో నడిచి వెళ్లేందుకు భయపడుతున్నారు. స్థానిక పంచాయతీ ప్రధాన రహదారి, మేదరవీధి, గవరపేట మధ్య వీధి, కస్పా వీధి, వడ్డి వీధి, గోవిందరావు కాలనీ, భవాని కాలనీ, హౌసింగ్ కాలనీ, ఉప్పునీటి దిబ్బ తదితర ప్రాంతాల్లో వీటి బెడద ఎక్కువగా ఉంది. ఆయా ప్రాంతాల్లో ద్విచక్ర వాహనదారులపై, నడిచి వెళ్లేవారిపై అరుస్తూ, మూకుమ్మడిగా వెంట పడుతున్నాయి. ఒక్కోసారి వాహనదారులు ప్రమాదాల బారిన పడి గాయాల పాలవుతున్నారు. ఇక చీకటి పడిందంటే వీటి బాధ చెప్పనలవి కాకుండా ఉంది. ఇతర పనుల మీద, ఉద్యోగరీత్యా విధులకు వెళ్లి, ఇళ్లకు వచ్చే వారు కుక్కల బారిన పడక తప్పడం లేదు. దీంతో కుక్కల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.